క్లుప్తంగా

బీజేపీ ప్రజాపోరు యాత్ర



ఒంగోలు సెంట్రల్: బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని నెల్లూరు బస్టాండ్, రత్న మహల్, సీవీఎన్ రీడింగ్ రూమ్, గాంధీరోడ్ బొమ్మ కూడలి ప్రాంతాల్లో బీజేపీ ప్రజాపోరు యాత్ర నిర్వహించారు. బీజేపీ ఒంగోలు అసెంబ్లీ కన్వీనర్ వైసీ యోగయ్య యాదవ్ ఆధ్వర్యంలో యాత్ర నిర్వహిస్తూ బీజేపీ ఆధ్వర్యంలో గత పదేళ్లలో సాధించిన విజయాలను వివరించారు. ఒంగోలు పార్లమెంట్ కన్వీనర్ సెగ్గం శ్రీనివాసరావు, తోగంటి శ్రీనివాసరావు, బీజేపీ అధికార ప్రతినిధి బొద్దులూరి ఆంజనేయులు, ధనిశెట్టి రాము, గుర్రం సత్యనారాయణ, కోటేశ్వరి, సత్యవతి, అజయ్, రాధాక్రిష్ణమూర్తి, సుధాకర్, రంగనాథ్, విజయ్‌మోడీ, హరిక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిర్వహణపై పోలీసులకు అవగాహన



పోలీసులకు సూచనలిస్తున్న డీఎస్పీ కిషోర్‌బాబు

చీమకుర్తి: రానున్న ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించాలని ఒంగోలు డీఎస్పీ కిషోర్ బాబు పోలీసులకు సూచించారు. మంగళవారం డీఎస్పీ చీమకుర్తి పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్‌తో పాటు నియోజకవర్గంలోని నాలుగు మండలాల ఎస్సైలు, ఇతర పోలీస్ సిబ్బందికి ఎన్నికల నిర్వహణపై అవగాహన కల్పించారు. తొలుత స్టేషన్‌లోని రికార్డులను పరిశీలించారు.

పేస్‌లో ముగిసిన అవగాహన సదస్సు



సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

ఒంగోలు: స్థానిక పేస్ ఇంజినీరింగ్ కాలేజీలో షోకేస్ ఇన్నోవేటివ్ అవగాహన సదస్సు మంగళవారం ముగిసింది. ఏఐఎంఎల్, ఏఐడీఎస్ విభాగాల వారు సంయుక్తంగా సదస్సు నిర్వహించారు. ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో నిర్వహించగా సొసైటీ ఫర్ డేటా సైన్స్ సంస్థ పాల్గొంది. కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దిశెట్టి శ్రీధర్ మాట్లాడుతూ సాఫ్ట్‌వేర్ రంగంలో వస్తున్న నూతన సాంకేతికతకు అనుగుణంగా పేస్ కాలేజీలో నిర్వహిస్తున్న ఇటువంటి సదస్సులు విద్యార్థులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్నాయన్నారు. కాలేజీ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ జీవీకే మూర్తి మాట్లాడుతూ కాలేజీలో జరిగే క్యాంపస్ ప్లేస్‌మెంట్స్‌ను సద్వినియోగం చేసుకునేందుకు ఎంతగానో తోడ్పడతాయన్నారు.

చట్టాలను అమలు చేయండి

మార్కాపురం టౌన్: చట్టాలను అధికారులు పటిష్టంగా అమలు చేయాలని సబ్‌కలెక్టర్ రాహుల్‌మీనా ఆదేశించారు. మంగళవారం తన చాంబర్‌లో ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధకచట్టం, పౌరహక్కుల రక్షణ చట్టం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పౌరుల హక్కులకు రక్షణ కల్పించాలని ఎస్సీ, ఎస్టీ చట్టాలను పక్కాగా అమలు చేయాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ రవీంద్ర, ఎంపీడీఓ చందన, ఏఎస్‌డబ్ల్యుఓ అరుణ, డీఎల్‌పీఓ నాగేశ్వరరావు, పట్టణ ఎస్సై అబ్దుల్ రెహమాన్, డాక్టర్ విజయ చందర్, ఐసీడీఎస్ అధికారి బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు, పెన్షనర్ల పీఎఫ్ సమస్యలు పరిష్కరిస్తాం



మాట్లాడుతున్న పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్

● పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్

మద్దిపాడు: కార్మికులకు, పెన్షనర్లకు, ఉద్యోగులకు పీఎఫ్‌కు సంబంధించి ఎటువంటి సమస్య వచ్చినా తమకు తెలియజేస్తే సమస్యను పరిష్కరిస్తామని పీఎఫ్ కమిషనర్ సతీష్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని గుండ్లాపల్లి గ్రోత్‌సెంటర్‌లో జేసీ బయోటెక్ కంపెనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ప్రసంగించారు. ప్రతి ఉద్యోగి, కార్మికుడిని పీఎఫ్ కంపెనీల ద్వారా తాము రిజిస్టర్ చేస్తామని ఆ పీఎఫ్ విషయంలో ఏదైనా తేడా వస్తే తనను సంప్రదించాలని ఆయన ఉద్యోగులకు సూచించారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి, జిల్లా నోడల్ అధికారి సమ్మయ్య మాట్లాడుతూ నిధి ఆప్‌కే నిఖత్ వారు భవిష్యనిధి సంస్థలో జరుగుతున్న నూతన విధానాలను పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఉద్యోగులకు కార్మికులకు వివరించారు. కంపెనీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నవీన్ కృష్ణ మాట్లాడుతూ ఈకార్యక్రమం కంపెనీ ఉద్యోగులకు ఉపయోగకరంగా ఉందని అభినందించారు. కార్యక్రమంలో వారి వెంట సుధాకర్, శర్మ, రామారావు, శంకర్ నారాయణ, జిల్లా కార్యాలయ ఉద్యోగులు బయోటెక్ కంపెనీ ఉద్యోగులు పలువురు పాల్గొన్నారు.

జ్ఞానాన్ని పెంపొందించుకుంటే ఉన్నత స్థానం

● ఏకేయూ వీసీ ప్రొఫెసర్ మారెడ్డి అంజిరెడ్డి



డాక్టర్ జీవన్‌ను సత్కరిస్తున్న ఏకేయూ వీసీ మారెడ్డి అంజిరెడ్డి

ఒంగోలు: జ్ఞానాన్ని సముపార్జించుకోవడం ద్వారానే విద్యార్థులు ఉన్నత స్థానంలో ఉండడం సాధ్యపడుతుందని ఆంధ్రకేసరి విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మారెడ్డి అంజిరెడ్డి అన్నారు. స్థానిక ఏ1 ఫంక్షన్ హాలులో నాగార్జున డిగ్రీ కాలేజీ వారి 24వ వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యతో పాటు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను వృద్ధి చేసుకోవాలని దిశా నిర్దేశం చేశారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన వైఎస్సార్ సీపీ వైద్య విభాగం జోనల్ ఇన్‌చార్జి, ప్రముఖ ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు డాక్టర్ చిడితోటి జీవన్ మాట్లాడుతూ లక్ష్యాన్ని నిర్దేశించుకుని దానికి అనుగుణంగా కోర్సులను ఎంపిక చేసుకుంటూ ఒక రూట్ మ్యాప్ సిద్ధం చేసుకోవాలన్నారు. అనంతరం ఆ రూట్ మ్యాప్‌కు అనుగుణంగా సాధన చేస్తేనే పోటీ ప్రపంచంలో ఉన్నత స్థానానికి చేరుకోవడం సాధ్యపడుతుందన్నారు. నాగార్జున విద్యా సంస్థల చైర్మన్ వి.రాంప్రసాద్ మాట్లాడుతూ విద్యార్థులు కాలేజీల్లో జరిగే సీఆర్‌టీ కార్యక్రమాన్ని వినియోగించుకుని మంచి ఉద్యోగం సాధించుకోవాలన్నారు. కేవలం డిగ్రీ సర్టిఫికెట్ పొందడం మాత్రమే కాదని, చివరకు ఉద్యోగ నియామక పత్రంతో విద్యార్థులు వెళ్లాలనే ఆకాంక్షతో కాలేజీలో క్యాంపస్ ప్లేస్‌మెంట్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రిన్సిపాల్ వి.వసంతలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్ ఆర్.యోగయ్య చౌదరి పాల్గొన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నాయకులు



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న బాలినేని ప్రణీత్‌రెడ్డి

● పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన ప్రణీత్‌రెడ్డి

ఒంగోలు: టీడీపీ నాయకులు పలువురు వైఎస్సార్ సీపీలో చేరారు. స్థానిక 13వ డివిజన్‌లో టీడీపీ తరుపున పోటీ చేసిన కనమాల కోటి రత్నం, వారి కుమారుడు కనమాల వెంకటకృష్ణ వైఎస్సార్ సీపీ యువనాయకుడు బాలినేని ప్రణీత్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వైఎస్సార్ సీపీ 13వ డివిజన్ ఇన్‌చార్జి మానపల్లి సూర్య రాజేష్, మాజీ కౌన్సిలర్ కట్టా సుధాకర్, కొల్లం దీపక్, రాజీవ్ కట్టా తదితరుల ఆధ్వర్యంలో వీరు పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ప్రణీత్‌రెడ్డి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండింటికి చిరునామా వైఎస్సార్‌సీపీ అన్నారు. వాస్తవాలను ప్రజలు తెలుసుకుంటున్నారని, కేవలం విష ప్రచారం ద్వారా ప్రజలను నమ్మించే వారి ఆటలు ఇక సాగవన్నారు. నగరంలో జరిగిన అభివృద్ధిని చూసి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరుతున్నారని తెలిపారు. వైఎస్సార్ సీపీ విజయంలో పాలు పంచుకునే ప్రతి ఒక్క నాయకుడు, కార్యకర్తకు తప్పక అండగా ఉంటామని హామీ ఇచ్చారు. పార్టీలో చేరిన వారు ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉంటూ పార్టీ విజయంలో కీలక పాత్ర పోషించాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు.

విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత చాలా అవసరం



ప్రశంస పత్రాలు అందజేస్తున్న అధికారులు

నాగులుప్పలపాడు: విద్యార్థి దశ నుంచే బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన అంశాలతో పాటు ఆర్థిక అక్షరాస్యత చాలా ప్రాముఖ్యమని లీడ్ బ్యాంక్ మేనేజర్ అబ్దుల్ రహీమ్ అన్నారు. రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో అమ్మనబ్రోలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు ఆర్థిక అక్షరాస్యత పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా బ్యాంకుల ప్రాముఖ్యత, లావాదేవీలు వంటి అంశాలపై అవగాహన కల్పించారు. విజేతలకు మేల వైష్ణవి, బ్రహేంద్ర చౌదరి, చక్రవర్తి ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.2 వేలు, రూ.1200, రూ.800 తో పాటు ప్రశంస పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో లీడ్ బ్యాంకు ఆఫీసర్ అనీల్ కుమార్, ప్రధానోపాధ్యాయురాలు సత్యవతి, సాయికుమార్ పాల్గొన్నారు.

పల్స్‌పోలియోకు ఏర్పాట్లు

మద్దిపాడు: మండల పీహెచ్‌సీ పరిధిలో మార్చి 3వ తేదీన పల్స్‌పోలియో చుక్కలు వేయడానికి ఆస్పత్రి వర్గాలు ఏర్పాటు చేస్తున్నాయి. ఆస్పత్రి డాక్టర్ శ్రావణ్, జగదీష్‌ల ఆధ్వర్యంలో మొత్తం 5574 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించారు. మొత్తం 37 బూత్‌లు రెండు మొబైల్స్, మల్లవరం రిజర్వాయర్ వద్ద మేళా ద్వారా మండలంలో అన్ని ప్రాంతాల్లో చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి సన్నాహాలు చేస్తున్నట్లు తెలిపారు. 4, 5 తేదీల్లో ఇంటింటికీ తిరిగి మిగిలిపోయిన వారికి పోలియో చుక్కలు వేయించనున్నట్లు చెప్పారు.

పోలేరమ్మ దేవాలయంలో చోరీ

కొమరోలు: మండలంలోని గోనపల్లె సమీపంలో వెలసిన పోలేరమ్మ దేవాలయంలో చోరీ జరిగింది. సోమవారం అర్ధరాత్రి తరువాత గుర్తు తెలియని వ్యక్తులు ఆలయంలోకి ప్రవేశించి ఆలయం గేటుకు ఉన్న తాళాలు పగులగొట్టి ఆలయంలో ఉన్న హుండీని ఆలయ వెనుక భాగానికి తీసుకుని వెళ్లి గడ్డపారతో బద్దలు కొట్టి హుండీలో ఉన్న నగదును దోచుకెళ్లారు. మంగళవారం తెల్లవారు జామున ఆలయాన్ని పరిశీలించేందుకు వచ్చిన ఆలయ నిర్వాహకులు ఆలయంలో చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. గతంలో కూడా రెండు సార్లు ఆలయంలో దొంగతనం జరిగినట్లుగా ఆలయ నిర్వాహకులు తెలిపారు. కొమరోలు ఎస్సై కోటేశ్వరరావు సంఘటన స్థలానికి చేరుకునికేసునమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

యుద్ధప్రాతిపదికన రెండు డీప్‌బోర్లు ఏర్పాటు

తర్లుపాడు: రానున్న వేసవిని దృష్టిలో ఉంచుకుని మండల కేంద్రం తర్లుపాడులో రెండు నూతన బోర్లు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ పి.వరాలు తెలిపారు. తర్లుపాడులో నీటి లభ్యత లేకపోవడంతో సోమవారం రాత్రి నాయుడుపల్లి సమీపంలో బోరు వేయగా సుమారు రెండున్నర ఇంచుల నీరు లభ్యమైనట్లు తెలిపారు. 1.5 కిలోమీటర్ల మేర పైపులైన్లు వేసి తర్లుపాడులోని రజక కాలనీకి నీటిని అందిస్తామని పేర్కొన్నారు. గ్రామంలో నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని మంగళవారం రాత్రి మరో బోరును వేయనున్నట్లు తెలిపారు. సహకరించిన ఎంపీపీ భూలక్ష్మి రామసుబ్బారెడ్డి, ఎంపీడీఓ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. వర్షాభావ ప్రభావంతో భూగర్భజలాలు అడుగంటాయని గ్రామంలో సుమారు 20 బోర్ల నుంచి నీరు సరఫరా చేస్తున్నామని వివరించారు.

తాగునీటి కొరత లేకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ ఫణికుమార్ నాయక్

కొత్తపట్నం: తాగునీటి కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ ఆర్ ఫణికుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సహజవనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీ, మౌలిక సదుపాయాల కార్యాచరణ కమిటీ, మానవ వనరుల యాజమాన్య కార్యాచరణ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతి బోర్ల విషయంలో మెటీరియల్ మాత్రమే ఇస్తామని, మరమ్మతులు చేయడానికి కూలి ఖర్చు ఆయా పంచాయతీలు పెట్టుకోవాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వారి విధులు, బాధ్యతలు నిర్వహించేందుకు ఒకరోజు శిక్షణ నిర్వహిస్తామన్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వంశీకృష్ణారెడ్డి మాట్లాడుతూ జలజీవన్ మిషన్ ద్వారా పనులు జరుగుతున్నాయన్నారు. ఓవర్‌హెడ్ ట్యాంకులు 5 ప్రారంభించగా అందులో 2 పూర్తయ్యాయని, 3 వివిధ దశల్లో ఉన్నాయన్నారు. ఏఓ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ ఈకేవైసీ నూరుశాతం పూర్తయిందని తెలిపారు. అల్లూరు ఎంపీటీసీ మిట్నసల శాంతారావు మాట్లాడుతూ వెబ్‌ల్యాండ్‌లో లేని రైతుల పొలాలను చేర్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. చేతి పంపులు కొన్ని నిరుపయోగంగా ఉన్నాయని, వాటిని మరమ్మతులు చేసే పరిస్థితి లేదని, మరమ్మతులను మండల పరిషత్ కార్యాలయం పెట్టుకోవాలని కొత్తపట్నం ఎంపీటీసీ రామలింగం వెంకట్రావు కోరారు. మండల ఉపాధ్యక్షురాలు తాతా ఉమామహేశ్వరి, బండారు రుక్మిణమ్మ, పశు వైద్యాధికారులు ఆశ, అనూష, పీఆర్ ఏఈ శేషగిరిరావు, ఎఫ్‌డీఓ ఆషా, ఎంపీటీసీ సభ్యుడు పిన్ని నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్పీని కలిసిన ఎస్సీఎస్టీ మానిటరింగ్ కమిటీ సభ్యులు

మార్కాపురం: మార్కాపురం డీఎస్పీ ఎం.బాల సుందరరావును డివిజన్ ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు బూదాల గురవయ్య, ఆదిమూలపు అనీల్‌రాజా, శ్యామ్ తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి బొకే అందించి సన్మానించారు. డివిజన్‌లో ఎస్సీ ఎస్టీ చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని డీఎస్పీని కోరారు.

ప్రభుత్వ భూమిలో నిర్మాణం తొలగించాలి



అక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న తహసీల్దార్ దాస్

పెద్దారవీడు: మండల పరిధిలో కంభంపాడు సచివాలయం పరిధిలో ఓబులక్కపల్లి గ్రామం సమీపంలో ప్రభుత్వ భూమిలో అక్రమంగా నిర్మాణాలు చేపట్టారు. సర్వే నంబర్ 37–4లో ఎ 1.48 సెంట్ల ప్రభుత్వ భూమిలో రేకుల షెడ్ నిర్మాణం చేపట్టారు. దాదాపు రూ. 5 కోట్ల వరకు భూమి విలువ ఉంటుందని, ఆక్రమణ తొలగించి, ప్రభుత్వ భూమిని కాపాడాలని స్థానికులు ఈ నెల 12న ఒంగోలులో కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో అర్జీ ఇచ్చారు. దీంతో కలెక్టర్ నుంచి ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని పరిశీలించాలని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి అర్జీ వచ్చింది. దీంతో స్పందించిన తహసీల్దార్ కె. దాస్ మంగళవారం ఆక్రమణకు గురై నిర్మాణం చేపట్టిన భూమిని పరిశీలించారు. స్థానిక కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ప్రభుత్వ భూమిని ఆక్రమించిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు. వెంటనే రేకుల షెడ్ తొలగించాలని అక్రమణదారులను ఆదేశించామని తెలిపారు. మీ దగ్గర భూమికి సంబంధించిన ఆధారాలు ఏమైనా ఉంటే రెండు రోజుల్లో కార్యాలయానికి వచ్చి చూపించాలని ఆక్రమించిన వారికి చెప్పామన్నారు. ఆధారాలు చూపించని పక్షంలో రేకుల షెడ్డును తొలగించి ప్రభుత్వ భూమిగా స్థలంలో నోటీసు బోర్డును ఏర్పాటు చేస్తామని తహసీల్దార్ తెలిపారు.

ప్రకృతి వ్యవసాయం సాగుపై శిక్షణ



ప్రకృతి కషాయాలతో పండించిన ఆకు కూరగాయలపై శిక్షణ ఇస్తున్న సుధాకర్

కొత్తపట్నం: రైతు సాధికార సంస్థ ఆంధ్రప్రదేశ్ కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ వి.సుభాషిణి ఆధ్వర్యంలో మంగళవారం ప్రకాశం, బాపట్ల జిల్లా నుంచి వచ్చిన మెంటార్స్, ఫార్మర్స్ సైంటిస్ట్‌లకు ప్రకృతి వ్యవసాయం రాష్ట్ర కార్యాలయం నుంచి వచ్చిన టీఎల్ సుధాకర్ శిక్షణ ఇచ్చారు. రీజనల్ ట్రైనింగ్‌లో భాగంగా మెంటార్ గుత్తికొండ ఝాన్సీలక్ష్మి శనగ పంటలో ప్రకృతి వ్యవసాయం పొలంబడిపై శిక్షణ ఇచ్చారు. ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయంలో గమనించాల్సిన అంశాల్లో వేరు వ్యవస్థ, మిత్ర పురుగులు, శత్రు పురుగులు, భూమి, వాతావరణ మార్పులు గురించి వివరించారు. తరువాత కొత్తపట్నంలో కోమట్ల నాంచార్లరెడ్డి, పాదర్తిలో చిన్న శ్రీనివాసులు, భవాని, భాగ్యలక్ష్మి, దుర్గాదేవి నిరంతరం పండించే కూరకాయలు, ఆకుకూరలు సాగును క్షుణ్ణంగా వివరించారు. పిట్టు వెంకటేశ్వరరెడ్డి సాగుబడి చేస్తున్న వేరుశనగ పైరుపై శిక్షణ ఇచ్చారు. ఎంత పెట్టుబడి, ఎంత మిగులు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం సాగు ఎంతో బాగా చేస్తున్నారని, ఇదే విధంగా అన్ని ప్రాంతాల్లో చేయాలని సుధాకర్ అభినందించారు. కార్యక్రమంలో రీజినల్ కో ఆర్డినేటర్ వెంకటరావు, శివకోటి, శ్రీకాంత్, వికాస్‌రెడ్డి, నరసింహులు, కొట్టం, శిరీష పాల్గొన్నారు.

మార్చి 2న ఛలో అద్దంకి



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఎంఈఎఫ్ నాయకులు

ఒంగోలు: మార్చి 2న అద్దంకిలో ఎంఆర్‌పిఎస్ సభను జయప్రదం చేసే కార్యక్రమంలో భాగంగా జిల్లానుంచి పెద్ద ఎత్తున మాదిగలు తరలివచ్చి ఛలో అద్దంకి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాదిగ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు డి.భిక్షాలు, జాతీయ ఉపాధ్యక్షుడు బి.ఏసుదాసు తదితరులు విజ్ఞప్తిచేశారు. స్థానిక సంతపేటలోని మాదిగ ఉద్యోగుల సమాఖ్య కార్యాలయంలో మంగళవారం ఈ మేరకు ఛలో అద్దంకి కార్యక్రమ కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ విషయం జడ్జిమెంట్ సుప్రీంకోర్టు రిజర్వు చేసిందన్నారు. ఈ అంశానికి సంబంధించి జరుగుతున్న పరిణామాలు, సుప్రీం కోర్టులో జరిగిన వాదనల వివరాలను ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందా కృష్ణ మాదిగ తెలియజేస్తారన్నారు. కరప్రతాల ఆవిష్కరణలో జిల్లా అధ్యక్షుడు డి.ఐజాక్, జిల్లా గౌరవ సలహాదారులు టి.కిషోర్, డివిజన్ అధ్యక్షుడు జె.రోజారావు, జిల్లా కోశాధికారి తేళ్ల జాలారావు, మహిళా నాయకురాలు జ్యోత్స్న తదితరులు పాల్గొన్నారు.

జాబ్ మేళాలో డిగ్రీ విద్యార్థుల ఎంపిక

యర్రగొండపాలెం: ఒంగోలులోని డీఎస్ ప్రభుత్వ మహిళా కళాశాలలో మంగళవారం జరిగిన జాబ్ మేళాలో స్థానిక ప్రభుత్వ మోడల్ డిగ్రీ కళాశాలకు చెందిన 13 మంది విద్యార్థులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ జి.శ్రీధర్ నాయుడు తెలిపారు. గ్రీన్ టెక్ కంపెనీకి ఆర్.చైతన్య శివప్రసాద్, బి.నాగేంద్రబాబు, డి.రవికిరణ్, ఎం.నాగరాజు, పేటీఎం, డీమార్ట్‌కు జి.నాగరాజు, టెలికాలింగ్‌కు ఎం.పెద్దయాకోబు, జోయలుకాస్‌కు బి.నాగేశ్వరరావు, ముత్తూట్ ఫైనాన్స్‌కు శివనాగరాజు, బయ్యన్న, డీమార్ట్‌కు ఎస్. నవీన్, బ్యాంక్ జోన్‌కు మరియబాబు, రిలియన్స్ ట్రెండ్స్‌కు వీరాంజనేయులు, ఎం.నరేష్‌లు ఎంపికయినట్లు తెలిపారు.

సర్వాంగ సుందరంగా శ్రీశైల ముఖద్వారం



విద్యుత్ దీపాలతో ఆకర్షణగా ఉన్న శ్రీశైల ముఖ ద్వారం ఆర్చి

పెద్దదోర్నాల: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీశైలం దేవస్థానం ఆధ్వర్యంలో మండల కేంద్రంలో నిర్మించిన ముఖద్వారం పర్వదినానికి ముందుగానే సర్వాంగ సుందరంగా ముస్తాబయింది. రంగు రంగుల విద్యుత్ దీపాలతో పాటు, ముఖద్వారానికి నూతనంగా వేసిన రంగులతో నిత్యం శ్రీశైలం వెళ్లే యాత్రికులను అలరిస్తోంది. మార్చి 1 నుంచి 11వ తేదీ వరకు శ్రీశైల పుణ్యక్షేత్రంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. మండల కేంద్రంలో నిర్మించిన శివసదనం అతిథి గృహాన్ని అలంకరించారు. తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటును అధికారులు చేపట్టారు.

దాతృత్వం చాటుకున్న తాటిపర్తి చంద్రశేఖర్



గోవింద్‌రాజులకు రూ. 10 వేలు ఆర్థిక సహాయం అందిస్తున్న చంద్రశేఖర్ .

పుల్లలచెరువు: మండలంలోని ఐటీవరం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ కార్యకర్త నూగుతోటి గోవింద్‌రాజులు రోడ్డు ప్రమాదం గాయపడ్డాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తాటిపర్తి చంద్రశేఖర్ తన దాతృత్వాన్ని చాటుకున్నాడు. సోమవారం గోవింద్‌రాజును పరామర్శించి, ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని రూ. 10 వేలను ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులు చంద్రశేఖర్‌కు కృతజ్ఞతలను తెలియజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ కన్వీనర్ బీవీ, సుబ్బారెడ్డి, మాజీ సర్పంచ్ సామ్యూల్, సూర్యనాయక్, చరణ్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్ సెందిరెడ్డి పాల్గొన్నారు.

16న జాతీయ లోక్ అదాలత్

గిద్దలూరు రూరల్: జాతీయ లోక్ అదాలత్ మార్చి 9న కాకుండా మార్చి 16వ తేదీకి వాయిదా వేసినట్లు గిద్దలూరు అడిషినల్ జూనియర్ సివిల్ జడ్జి బి.మేరిసారాదానమ్మ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 8న మహాశివరాత్రి పండగను దృష్టిలో ఉంచుకుని వాయిదా వేసినట్లు చెప్పారు.